# శరణార్థి

"పంజాబు వెడతావా?" అని మా మేనేజరు అడిగాడు.

నేనేం మాట్లాడలేదు. పంజాబులో ఏమూల చూచినా మతకలహాలు. హిందువులని తురకలు చిత్రవధ చెయ్యటం, స్త్రీల మానభంగాలు, ధననష్టం, ఇవన్నీ వింటూ వేలకొలది సంఖ్యలో ఢిల్లీకి పారిపోయి వచ్చే శరణార్థులని చూస్తూ పంజాబు వెడతానని ఎల్లా అనగలను?

నేనేం మాట్లాడక పోయేసరికి ఆయనే,

"నువ్వు పడుతున్న తికమక నాకు అర్థమయింది. పంజాబులో పరిస్థితి నాకు తెలియనిది కాదు. నీకు ఎటువంటి అపాయం రాకుండా కాపాడ గలననే ధైర్యం నాకుంది. కాబట్టే నిన్ను యీ విషయం అడగగలిగాను. ఇంకా ఎవరినైనా పంపుదామంటే, యీ పనివాళ్ళు నెగ్గుకు రాగలరనే ధైర్యం నాకు లేదు. నీలో నాకు గట్టినమ్మకం ఉంది. ఇది జయప్రదంగా సాధించావంటే, నీకు భవిష్యత్తులో లాభించవచ్చు" అని అన్నాడు.

"బ్రతికివుంటే గదా భవిష్యత్తును గురించి ఆలోచించవలసింది?" అని అనుకున్నా. అప్పుడు యింకొక గడ్డుసమస్య వచ్చింది. ధైర్యంచేసి వెళ్ళడమా? లేకపోతే ఆయనతో "నన్ను గురించి మీకు ఉన్న అభిప్రాయం తప్పు. నేను ఉత్త పిరికివాడిని. మీరు యీపనికి ఎవరినైనా పంపవలసింది" అని చెప్పడమా? చివరికి ధైర్యం చేసి "వెడతాను" అని అన్నాను.

అలాగే మరునాడు బయలుదేరి పంజాబులో ఒక పల్లెటూరు వెళ్లాను. కొంతదూరం రైలు ప్రయాణంచేసి, అక్కడి నుంచి జీప్‌లో గమ్యస్థానం చేరుకున్నాను. ఆ ఊరుకు యింకా యీ ద్వేష జ్వాలలు పాకలేదు. కాని ఊరంతా ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని మసలుకుంటున్నారు. ఆ ఊళ్లోంచి ప్రతిరోజు వెళ్ళి శరణార్థుల గాథలు వింటూంటే అవమానంతో, ద్వేషంతో రక్తం ఉడుకెత్తేది. బాధతో హృదయం కుమిలిపోయేది.

అయిదురోజులు ఆ వూళ్లో గడచిపోయాయి. ఆరవ రోజు ఉదయం ప్రక్క ఊళ్లోంచి మంటలు కనిపించాయి. హాహాకారాలు, ఆర్తనాదాలు యిక్కడికి కూడా వినిపించాయి. శరణార్థుల సంఖ్య క్రిందటి రోజుకంటే చాలా ఎక్కువగా వుంది. ఉదయమే బయలుదేరి, నేనూ, ఒక డజనుమంది సాయుధ సైనికులు

జీపుల్లో, అక్కడికి ఇరవైమైళ్ళ దూరంలో వున్న ఒక గ్రామానికి వెళ్ళి సాయంత్రం తిరిగి వస్తూంటే, మా గ్రామం రెండు మూడు మైళ్ళు వుండగానే పెద్ద పెద్ద మంటలు కనిపించాయి. ఆయుధాలు సిద్ధం చేసుకుని మేము పోలీసు స్టేషను వైపుకు జీపు పోనిచ్చాం. నా సామానులు ఆఫీసు కాగితాలు అక్కడే వున్నాయి. ఊరంతా నానా భీభత్సంగా వుంది. చాలావరకు హిందువుల యిళ్ళు అగ్గినిపడి దగ్ధమవు తున్నాయి. రోడ్డు పొడుగునా గాయాలు తగిలి ప్రాణం పోక విలవిల లాడుతూ వున్నవాళ్ళు అనేక వందలమంది కనిపించారు.

పోలీస్‌స్టేషన్ చూరుతూవుండగా "మారో! మారో!" అంటూ కేకలు వినిపించాయి. ఒక యాభై సంవత్సరాలు దాటిన స్త్రీ, ఆమె వెంట పద్దెనిమిది పంతొమ్మిది సంవత్సరాల పిల్లా పరుగెత్తుకు వస్తున్నారు.

"బచావ్! బచావ్!" అంటూ ఆ పిల్ల పోలీసుస్టేషన్ వైపు పరుగెత్తుతోంది. కాని ఆ సాయిబులు అంతకంటే వేగంగా వాళ్ళతో కలుసుకున్నారు. సాయిబుతో ముసలావిడ పెనుగులాడుతోంది. వెంటనే గుండెలో కత్తి గుచ్చుకుంది. పెద్ద కేక వేస్తూ ఆవిడ నేల కొరిగింది. వెంటనే జీపులోంచి రెండు రైఫిల్స్ మ్రోగాయి. ఆ సాయిబు కూడా అక్కడే ప్రాణాలు విడిచాడు.

రెండో సాయిబు ఆ పిల్లని చొక్కా పుచ్చుకు గుంజుతున్నాడు. రైఫిల్ మోత వినగానే, ఆ పిల్లని వదిలి జీప్‌వంక చూశాడు. చూసి వెంటనే వెనక్కి తిరిగి పరుగెత్తడం మొదలుపెట్టాడు. జీప్‌లోంచి రైఫిల్ యింకొకసారి మ్రోగింది. వెర్రి కేక పెట్టి అక్కడే కూలిపోయాడు.

"మర్‌గయాసాలా!" అని నా ప్రక్కన కూర్చొన్న సర్దార్ పలన్‌సింగు అన్నాడు. ముసలావిడ మరణించిన చోట జీపును ఆపి దిగాం.

"చాచీ! చాచీ!" అంటూ ఆ పిల్ల ముసలావిడ శవం మీద పడి ఏడవటం మొదలు పెట్టింది.

ఆ పిల్లని ఓదార్చడానికి మే మెవ్వరం ప్రయత్నం చెయ్యలేదు. చేష్టలు దక్కి అలాగే నిలబడిపోయాము. ఈ దారుణకాండ కళ్లార చూచేసరికి క్షోభతో హృదయము దహించుకుపోయింది.

పలన్‌సింగు ఆ పిల్ల దగ్గరికి వెళ్లి "ఊరుకో తల్లీ, పోయిన వాళ్ళు తిరిగి రారు" అని అన్నాడు. ఆ పిల్ల యింకా వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

"ఎంత విచారించినా పోయిన వాళ్ళు తిరిగి రారు. ఉన్నవాళ్లతోనే మన జీవితాన్ని గడపాలి..." అన్నాను.

"ఉన్నవాళ్ళు అంతా పోగా మిగిలిన పిన్ని కూడా యిల్లా అయిపోయింది.'

"ఎవ్వరూ లేరా?" అని నేను అడిగాను.

"లేరు" అన్నట్టు తలవూపింది.

నా వెంట వున్నవాళ్ళు నా సామానులు, కాగితాలు జీపులో పెట్టారు. ఇహ ఆ ఊరు విడిచి ఢిల్లీకి వెళ్ళిపోవాలి. బయలుదేరే ముందు "నీ పేరేమిటి?" అని అడిగాను.

"చంపా" అని సమాధానం చెప్పింది.

"చూడు తల్లీ! మేమంతా యిక్కడనుంచి ఢిల్లీ పోతున్నాం... ఇక్కడ నీకు తోడూ నీడా ఎవ్వరూ లేరు. ఏదైనావస్తే నిన్ను కాపాడేదెవరు? నువ్వు కూడా మాతో బాటు ఢిల్లీ వచ్చేసేయి" అని అన్నా.

ఆ పిల్ల మాట్లాడకుండా జీప్‌లో వచ్చి కూర్చుంది.

జీపులు రైల్వేస్టేషన్ చేరేసరికి అక్కడ పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. కొన్నివేలమంది జనం రైలుకోసం కాచుకుని ఉన్నారు. వాళ్లని చూడగానే రైల్లో ప్రయాణము చేద్దామనే సంకల్పం మార్చుకుని సరాసరి ఢిల్లీదాకా కారులోనే ప్రయాణం చేసి ఢిల్లీ చేరాం.

మా క్వార్టరుకు చేరేముందు ఆ పిల్లతో,

"ఢిల్లీలో మీ వాళ్లు ఎవరైనా వున్నారా?" అని అడిగాను.

"ఎక్కడా ఎవ్వరూ లేరు."

"నిన్ను మా యింటికి తీసుకు వెళ్ళడానికి నాకేం అభ్యంతరం లేదు కాని...'

"కానీ..."

"నువ్వు పంజాబీ దానివి. నేను తెలుగువాడిని. మాయింట్లో ఆడవాళ్లు ఎవ్వరూ లేరు. నేను ఒంటరి వాడిని."

"నన్ను వెళ్ళిపొమ్మని చెప్పటానికి యిన్ని మాటలెందుకు బాబూజీ... మిమ్మల్నేమీ కష్టపెట్టను- వెళ్ళిపోతాలెండి" అని అన్నది.

నేను గతుక్కుమన్నాను.

"చూడు చంపా. నిన్ను వెళ్ళిపొమ్మని నేను అనటం లేదు. నీకు ఏదో చిరస్థావరం దొరికే దాకా నా దగ్గరే ఉండు. నీ వల్ల నాకేం కష్టం వుండదు. అంతే కాని నిన్ను పంపేసేయాలనే ఉద్దేశ్యం నాకు ఎప్పుడూ కలుగదు."

ఇంటికి చేరగానే మా నౌకరు గోవింద్ కనిపించాడు. చంపాని చూసి వాడేం మాట్లాడలేదు. కాని వాడు ప్రశ్నించకుండానే వాడికి జరిగినదంతా విపులంగా చెప్పాను.

"ఈరోజు నుంచి యీ పిల్ల మన యింట్లో ఉంటుంది. ఆ అమ్మాయికి కావలసినవన్నీ చూడవలసిన బాధ్యత నీది" అని అన్నాడు.

మరునాడు ఉదయం ఆఫీసుకు వెళ్ళేసరికి బడాసాహెబ్ దగ్గర నుంచి వెంటనే రమ్మని కబురు వచ్చింది. నన్ను చూడగానే ఆయన అమిత సంతోషంతో, "మొత్తానికి మొనగాడి ననిపించుకున్నావే!" అని అన్నాడు. నేనేం మాట్లాడలేదు.

"నిన్ను మొదట్లో చూసినప్పుడే, నువ్వేమీ సామాన్యమైన వాడివి కాదని అనుకున్నా. లేకపోతే ఇంత ధైర్యసాహసాలు ఎవరికి వుంటాయి. నిన్ను గురించి ఇప్పుడే పైకి రాస్తున్నా- తప్పక ప్రమోషన్ వస్తుంది.

"థ్యాంక్యూ సర్."

"చాలా అలసిపోయినట్టున్నావు. ఇంటికి వెళ్ళి రెస్టు తీసుకో. నేను మళ్ళీ కబురు పంపుతానులే."

"మీతో ఒక్క విషయం చెప్పాలి..." అని నేను అన్నా.

"ఆఫీసు విషయమైతే రెండురోజుల తరువాత చెప్పు."

"కాదండి..."

జరిగిన దంతా ఆయనతో చెప్పాను. ఆయన నవ్వి, "క్షేమంగా వెళ్ళి లాభంతో తిరిగి వచ్చావన్న మాట. నీ శరణు కోరిన చిన్నదానికి ఢిల్లీ అంతా చూపించు. ఆగ్రా వెళ్ళి తాజ్ కూడా చూపించు. వెన్నెలలో చాలా బాగుంటుంది.' అన్నారు.

నాకు చాలా కోపం వచ్చింది. నేనేదో కష్టగాధ చెబితే యీయనేమో వేళాకోళంగా మాటాడుతాడు. శరణు కోరిన చిన్నది.

ఇంటికి వచ్చి, 'గోవింద్' అని పిలిచాను.

"బాబుజీ" అంటూ వాడు బయటకు వచ్చి, నన్ను చూడగానే,

"వచ్చారా బాబుజీ. నేనే మీకు ఫోన్ చేద్దామని అనుకుంటున్నాను."

"ఏం? ఏం జరిగింది."

"ఆవిడ ప్రొద్దుటి నుండి భోజనం చెయ్యకుండా ఏడుస్తోంది."

నేను చంపా కూర్చున్న గదిలోకి వెళ్లాను. మోకాళ్ళు మీద తలపెట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"చంపా" అని పిలిచాను.

తల ఎత్తి ఒక్కసారి నా వంక చూసి మళ్ళీ తల వంచుకుంది.

YOP-124

"ఏడుస్తే ఏం లాభం? జీవితాన్ని ధైర్యంతో ఎదుర్కోవాలి. లేకపోతే బ్రతకలేం. లేచి స్నానం చేసిరా. ఇద్దరం భోజనం చేద్దాం."

కాని ఆ పిల్ల అక్కడి నుంచి కదల్లేదు.

"బాబుజీ" అంటూ గోవింద్ పిలిచాడు.

"ఏం?" అని అడిగాను.

"ఒక్కసారి యిల్లా రండి."

నేను గదిలోనికి వెళ్ళాను.

"ఆవిడకి బట్టలు లేవు. ఏవైనా తెచ్చి పెట్టండి" అని అన్నాడు.

అప్పుడు అసలు విషయం గుర్తుకు వచ్చింది. ఇంత వరకూ గోవింద్ చెప్పేదాకా ఈ విషయమే స్ఫురణకు రాలేదు. వెంటనే రెడీమేడ్ షాపుకు వెళ్ళి నాలుగు జతల బట్టలు తీసుకువచ్చాను.

"నీకు బట్టలు తీసుకువచ్చాను. స్నానం చేసి కట్టుకో. భోజనం చేద్దాం.'

"నాకు ఆకలి లేదు."

"అయితే నాకూ ఆకలి లేదు. మేం కూడా భోజనం చెయ్యం."

"వద్దు, మీరు నాకోసం భోజనం మానవద్దు."

"ఇంటికి వచ్చిన అతిథి భోజనం చెయ్యకుండా మేము భోజనం చెయ్యకూడదు. ఇది మా సాంప్రదాయం."

కొంచెంసేపు చంపా ఏం మాట్లాడలేదు. బట్టలు తీసుకుని స్నానాల గదిలోకి వెళ్లింది.

భోజనం దగ్గర "చూడు చంపా! నీతో ఒక విషయం చెప్పాలి. ఈ రోజు నుంచి ఇది నీ ఇల్లు తెలుసా! ఇక్కడ ఏ విధమైన సంకోచం పడకూడదు. నీకు ఏం కావలసినా నాతో చెప్పు."

"........................."

"నువ్వేదో పరాయి యింట్లో ఉంటున్నానని, మా మీద ఆధారపడి వున్నావని అనుకోవద్దు. మే మెవ్వరం నీకు పరాయి వాళ్లం కాదు" అని అన్నా.

ఆ పిల్ల ఏం మాట్లాడలేదు.

ఆ రోజు నుండి మా దినచర్యలో మార్పు వచ్చింది. రోజూ ఆఫీసు నుంచి యింటికి తిరిగి వచ్చేసరికి కాఫీ ట్రేతో చంపా సిద్ధంగా వుండేది. ఇల్లు కూడా గుర్తు పట్టలేకుండా మారిపోయింది. ఒంటరి మగవాడు వుండే మకాం, ఒక చక్కటి

గృహంగా మారింది. ప్రతి వస్తువుకి ఒక నూతన అందం - ఒక నూతన జీవం వచ్చింది.

ఇంతలో తెలుగు సంవత్సరాది వచ్చింది. "ఇది మాకు చాలా ముఖ్యమైన పండుగ. ప్రతి సంవత్సరం నేను ఒక్కడినే పండుగ చేసుకోవలసి వచ్చేది. అందుకని ఎవరైనా స్నేహితుల యింటికి వెళ్ళి గడుపుతాను.

"నేను ఉన్నాను. పండుగ యింటి దగ్గరే చేసుకుందాం. మీకు రకరకాల పిండివంటలు చేసి పెడతాను" అని అన్నది.

క్రితం రోజునే కొన్న క్రొత్త బట్టలు గోవింద్‌కూ, చంపాకు యిచ్చా. ఆ పిల్లకు తెల్ల పాటిన్ పైజమా, నీలం సిల్కు చొక్కా, లేతపసుపు దుపట్టా కొనియిచ్చాను. బట్టల పొట్లం యిస్తూ "కట్టుకో" అని అన్నా.

చిన్న పిల్లలకంటె ఎక్కువ సరదాతో పొట్లం విప్పింది. వాటివంక చూసి ఏం మాట్లాడకుండా నిలబడింది.

"నచ్చలేదా?" అని అడిగాను.

తల ఎత్తకుండానే "బాగానే ఉన్నాయి" అని అంది.

"ఏవో చాలా వస్తువులు చేస్తూ హైరాణపడక, మామూలు వంటతో పాటు "చనేచావల్ చెయ్యి" అని అన్నాను.

"నహి! నహి!" అంటూ పెద్ద పెట్టున ఏడుస్తూ ప్రక్క గదిలోకి పారిపోయింది.

నిశ్చేష్టులై నేనూ, గోవింద్ నిలబడ్డాం.

ఆ పిల్లకు ఇంత బాధ ఎందుకు కలిగింది? నేను చేసిన పనిలోగాని, అన్నమాటలో గాని పొరపాటేమన్నా వుందా?

"చనే చావల్" అంటే నాకు చాలా యిష్టం. పంజాబీ హోటలుకు ఎప్పుడు వెళ్లినా, అది తప్పక తిని తీరవలసిందే! అందులో తప్పువిషయం ఏముంది?

నేను గదిలోకి వెళ్ళి చూసేసరికి చంపా, ప్రక్కమీద పడుకొని ఏడుస్తోంది.

"ఏం జరిగింది?" అని నేను అడిగాను.

"దయచేసి వెళ్ళిపోండి" అని అంది.

ఇహ నేను అక్కడ నిలబడలేదు. గోవిందుకు వంట పని అప్పచెప్పి, కనాట్ ప్లేసుకు వెళ్ళాను. అక్కడ మార్నింగ్ మ్యాటినీ చూసి, పన్నెండు గంటలకి యింటికి తిరిగి వచ్చాను. బెల్ కొట్టగానే చంపా వచ్చి తలుపు తీసింది. నన్ను చూడగానే,

"బాబుజీ, క్షమించండి" అని అన్నది.

"దేనికి?"

"మీకు బాధ కలిగించాను."

"దీంట్లో బాధ ఏముందీ, నీ మనుస్సులోని బాధ ఏమయిందీ తెలియక హైరాణ పడ్డాం. బహుశః మేము చేసిన పనిగాని, అన్నమాటగాని నిన్ను నొప్పించిందేమో, అది తలుచుకుని బాధ పడ్డావనుకొన్నాను."

"మీరు నన్ను ఏమంటారు? మీ వల్ల నాకు వచ్చిన బాధ ఏమిటి? మీరు నిజంగా దేవతలు.... నా బ్రతుకుని తలుచుకుని ఏడ్చాను."

మనకు సాధ్యంకాని వాటిని గురించి విచారించి ఏం ప్రయోజనం? వాటిని మరిచిపోవటానికి ప్రయత్నం చెయ్యాలి."

"మరిచి పోదామనే అనుకున్నా కాని ఇవ్వాళ అన్నీ మళ్ళీ గుర్తుకు వచ్చాయి."

"ఎందుకని?"

"నా పెళ్ళి నిశ్చయం అయిన రోజున యిటువంటి బట్టలే పెట్టారు."

"నీకు పెళ్ళి అయిందా?"

"లేదు. ఆరునెలల క్రితం జరుగవలసింది. కాని జరుగలేదు. మా గ్రామం తగులబడ్డ రోజుకు రెండు రోజుల క్రితం వాళ్ల ఊరు తగలపెట్టారు. ఏమైయ్యారో ఏమో తెలియదు. కాని కొందరు అనటం ఆయన కూడా..." ఇహ చెప్పలేకపోయింది. కంఠం గద్గదమయింది.

"నాకు అంతా అర్థమయిందిలే. నువ్వేం చెప్పనక్కర్లేదు నాకు. ఆయనకు ఏం ఫరవాలేదు. ఎక్కడో అక్కడ బ్రతికే ఉంటాడు. అతని పేరు చెప్పు. అతను ఎక్కడ ఉన్నదీ తెలియపర్చమని, వీలుంటే తక్షణం ఇక్కడికి రావలిసిందని పేపర్లో వేయిద్దాం."

ఆ పిల్ల ఏం మాట్లాడలేదు. రెండు చేతులూ జోడించి నమస్కారం చేసింది. ఆ భంగిమ చూడగానే నాకు నవ్వు వచ్చింది.

"పిచ్చిదానా" అంటూ లోపలికి వెళ్ళాను.

లక్ష్మణసింగు కోసం అనేక పత్రికలలో ప్రకటనలు చేశాం. రెండు మాసాలు గడిచాయి. మూడు మాసాలు గడిచాయి. అతని జాడ తెలియలేదు. నేను కూడా అందరూ అనుకునే మాటే అనుకోవలసి వచ్చింది. కాని ఎవ్వరు ఏమనుకున్నా మేము ఎంత నిరుత్సాహపడ్డా చంపా మాత్రం ధైర్యంగానే ఉండేది. బహుశః అనేక వేలమంది లాగా అతను కూడా హత్య చేయబడ్డాడేమో? అని అనుమానం వేసేది.

పని మీద ఆగ్రా వెళ్ళి రెండు రోజులు ఉండి తిరిగి వచ్చాను. ఇంటికి రాగానే గోవింద్,

"ఉదయం మీకోసం ఎవరో వచ్చారు" అన్నాడు.

"పేరు అడిగావా?"

"అడిగాను, చెప్పలేదు. అమ్మగారిని గురించి కాబోలు అడిగాడు."

"ఏ భాషలో మాట్లాడాడు?"

"మీరు, మీ మదరాసీ స్నేహితులు మాట్లాడే భాషలోనే."

ఎవరో స్నేహితులై ఉంటారని అనుకున్నాను. కాని వాళ్ళందరికి చంపాని గురించి తెలుసు. క్రొత్తగా అడగవలసిన పనిలేదే? ఈ ప్రశ్నకు సమాధానం ఆరోజు సాయంకాలం వచ్చింది.

సాయంకాలం ఆరు గంటలకి "రామం ఉన్నాడా?" అంటూ మా నరసింహం మావయ్య గదిలోకి వచ్చాడు.

"రా మామయ్యా! ఎప్పుడు వచ్చావు?"

"ఉదయం."

"అయితే యింతవరకు ఎక్కడున్నావు?"

"హోటల్లో."

"హోటల్లోనా? నేనుండగా హోటలులో దిగవలసిన పనేమిటి?"

"నేను అల్లాగే అనుకున్నా. కాని యిక్కడికి వచ్చి చూసిన తరువాత పరిస్థితి తారుమారైంది."

"ఏం జరిగింది?"

"ఇంకా ఏం జరగాలి? నువ్వు ఎవత్తెనో ముండని తెచ్చుకొని యింట్లో పెట్టుకున్నావని తెలుస్తే..."

"మావయ్య!!"

"ఈ యింటి గడపే త్రొక్కేవాడిని కాదు."

"నువ్వు అసలు విషయం తెలుసుకోకుండా మాట్లాడుతున్నావు."

ఇంకా తెలుసుకోవలసిం దేమిటంట? ఏ యీడులో జరగవలసిన ముచ్చట ఆ వయసులో జరగాలి. లేకపోతే యిటువంటి పనులే జరుగుతాయి. ఎవత్తెరా యిది...?"

"ఆ విషయమే నేను చెబుదామనుకుంటూ వుంటె మధ్య నువ్వే చెప్పనివ్వటం లేదు."

"సరే, ఏమిటో చెప్పు చూద్దాం."

నేను మొదటినుంచి జరిగినదంతా తూ.చ. తప్పకుండా చెప్పాను. అదంతా విని ఆయన నావంక చూసి,

"ఇదంతా నన్ను నమ్మమంటావా?" అన్నాడు.

"నమ్మినా, నమ్మకపోయినా ఉన్న విషయం అది."

"ఒరేయ్! ఎంత పల్లెటూరి వాడినైనా నువ్వనుకున్నంత తెలివి తక్కువ దద్దమ్మని కానురా."

"అదేమిటి మామయ్యా?"

"లేకపోతే ఏమిటిరా! ఒక యింట్లో ఎవ్వరూ లేకుండా వయస్సులో వున్న ఒక ఆడది, మొగవాడు కలిసి వుంటూ మేము పత్తిత్తులం అంటె ఎవరురా నమ్మేది? చెల్లెలి కొడుకువి, కూతుర్ని యిస్తే ఏదో ఉద్ధరిస్తావని కొండంత ఆశలు పెట్టుకుంటె యిటువంటి పనులు చేస్తావు?"

"నా మాట నమ్ము మామయ్య."

"దానితో నీ సంబంధం తెంచుకున్ననాడు నీమాట నమ్ముతాను."

"ఇప్పుడు ఎక్కడికి పోతుంది?"

"దానికి భయమేమిటిరా? నువ్వు కాకపోతే ఇంకొకడు దొరుకుతాడు.'

"ఆపు మామయ్య! ఇందాకటినుండి నీ ధోరణి చూస్తున్నాను. పెద్దవాడివి. మేనమామవి. నువ్వు తొందరపడ్డా నేను పడడం దేనికని తమాయించుకుని ఊరుకుంటె నీ యిష్టంవచ్చినట్టు మాట్లాడుతున్నావు. ఎవరు ఏమన్నా సరే, ఆ పిల్లదానికి ఒక స్థావరం ఏర్పడేదాక యిక్కడే వుంటుంది."

"అది యిక్కడ వుంటే చచ్చినా నా కూతురిని నీకు యివ్వను."

"ఫర్వాలేదులే. బ్రహ్మచారిగా ఉండిపోను. నామాట అంటె నమ్మకం లేనివాడి కూతురు, నాకు నిలువెత్తు ధనం యిచ్చినా అఖ్కర్లేదు."

"అఖ్కర్లేదా? ఎంత పొగరురా. నాకే నీతులు చెబుతున్నావు. ఈనాటి నుంచి నీవు కూడ మీ అమ్మతో బాటేనని అనుకుంటాను."

"నేను మాత్రం అల్లా అనుకోనులే మావయ్య!" అంతవరకూ తలుపు వెనుక నిలబడి మా మాటలు వింటోంది కాబోలు, చంపా నా దగ్గరకు వచ్చి,

"ఎవరు బాబూజీ వచ్చింది" అని అడిగింది.

"మా మేనమామ."

"మీ మీద కోపంగా వున్నారేం?"

అప్పుడు నాకు యింకొక సమస్య వచ్చింది. నిజం చెప్పి మావయ్యతో తగాదా తెచ్చుకున్నాను. మావయ్య అన్న మాటలన్నీ యీ పిల్లదానితో చెబుతే ఎంత బాధపడుతుంది! ఆ బాధతో ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే....

"బాబూజీ...."

నేను ఉలిక్కిపడ్డాను.

"ఏమిటి?"

"ఆయన ఏమన్నారు?"

"నన్ను పెళ్ళిచేసుకోమంటాడు."

"ఎవరిని?"

"వాళ్ళ అమ్మాయిని."

"చేసుకోండి. మీరు కూడా ఒక యింటి వారైతే నాకొక వదినె వస్తుంది. నాకు ఎంతో తోడుగా వుంటుంది. నన్ను గురించి ఏమైనా అడిగారా?"

"లేదు."

"లేదా! ఏమిటో కోపంగా మాట్లాడుతూ వుంటే నన్ను గురించి అడుగుతున్నారేమో అనుకున్నాను."

"అబ్బే నీ విషయం కాదు. వాళ్ళ అమ్మాయిని వెంటనే చేసుకోమంటాడు. నేనేమో కొద్దిరోజులు ఆగమంటాను. ఆయన మాట వినలేదని కోపగించుకొని వెళ్ళిపోయాడు."

"అంతేకదా! మన యిద్దరిని గురించి తప్పుగా అనుకున్నాడేమోనని భయపడ్డాను."

"ఛా! పిచ్చిదానా! తప్పుగా ఎందుకనుకుంటారు? నేనేమో తెలుగువాడిని. నువ్వేమో పంజాబీదానివి. మన గోవిందు కూడా పంజాబీవాడు. అందుకని నువ్వు అతని తాలూకు అనుకున్నాడు."

"మీ మాటలు నిజమేనా?"

"లేకపోతే అబద్ధమేమో ఆయన్నే అడుగు."

"నాకు మీభాష రాదుగా."

"రాకపోతే పోనీ నేర్చుకో."

ఆ రోజు నుండి చంపాకు గోవిందు తెలుగు నేర్పడం మొదలు పెట్టాడు. రెండు నెలలు గడిచిపోయాయి. పని మీద పఠాన్‌కోట వెళ్ళి పదిహేను రోజులుండి తిరిగివచ్చాను. ఆఫీసుకు వెళ్ళేసరికి నేను ఊళ్లో లేనప్పుడు వచ్చిన ఉత్తరాలన్నీ యిచ్చాడు. మావయ్య కూతురు లలిత ఉత్తరం రాసింది.

"బావా,

నాన్న నాతో అన్ని విషయాలూ చెప్పాడు. నేను నమ్మకూడదని అనుకున్నాను. కాని నమ్మక తప్పలేదు. నాన్న అబద్ధమాడే మనిషి కాదు. మా బావ అందరిలాంటి వాడు కాదు- అందరికంటె ఎక్కువైన వాడు అని చిన్నప్పటి నుండి అనుకున్నాను. ఎన్నో ఆశలు పెట్టుకున్నాను... ఎందుకులే ఇప్పుడా విషయాలన్నీ..."

నాకు కళ్ళు చీకట్లు కమ్మాయి. చివరకు లలిత కూడా నన్ను అపార్థం చేసుకుంది. అన్ని విషయాలూ చెబుతూ యీ పూటనే ఉత్తరం రాస్తాను. లలిత నామాట తప్పక నమ్ముతుంది.

ఉత్తరాల కట్టలో రెండు శుభలేఖలు కనిపించాయి. ఒకటి ఎవరో స్నేహితుడి తమ్ముడి పెళ్ళి. రెండవది లలిత పెళ్లి శుభలేఖ... పెళ్ళి జరిగి అప్పుడే వారం రోజులు గడిచిపోయాయి...

అంతులేని బాధ కలిగింది. అంతా పోగా చివరకు మిగిలిన మామయ్య నన్ను వదిలి పెట్టేశాడు. చిన్నప్పటి నుంచి ప్రేమించి ఎన్నో ఆశలు పెట్టుకున్న లలిత కూడా దూరం అయింది.

నాకు ఎవ్వరూ లేరు. నేను ఎవ్వరికి ఏమీ కానూ! చివరకు మిగిలేదేమిటి?

మనస్సు మనస్సులో లేదు. పిచ్చివాడిలాగా తిరిగి యింటికి వచ్చాను. బెల్ కొట్టగానే చంపా తలుపుతీసి సంతోషంతో, 'బాబూజీ వచ్చేశారే' అని అంది. కాని నా ముఖం చూసి ఒక్క అడుగు వెనక్కి వేసి 'ఏం జరిగింది?' అని అడిగింది.

అంతవరకు బలవంతంగా అణుచుకున్న బాధ ఒక్కసారి బయటకు వచ్చింది.

"నన్ను అందరూ వదిలేశారు. నేను ఎవ్వరికీ ఏమీ కాను" అని అన్నా.

నా చెయ్యి పుచ్చుకుని తీసుకు వెళ్ళి కుర్చీలో కూర్చోపెట్టింది.

"ఏం జరిగింది బాబూజీ. నాతో చెప్పరూ."

మెల్లిమెల్లిగా జరిగినదంతా చెప్పాను. "నాకు యిప్పుడు ఎవ్వరూ లేరు' అని అన్నా.

"ఎవ్వరూ ఎందుకు లేరు? నేను ఉన్నాను."

"అవును బాబుజీ! ఎవరేమనుకున్నా సరే, నేను మిమ్మల్ని వదలిపెట్టను. ఎప్పుడూ మీ నీడనే ఉంటాను. నాకోసం ఎంతో కష్టపడ్డారు. ఎంతో త్యాగం చేశారు. మీకు ఏమి యిచ్చినా మీ ఋణం తీర్చుకోలేను. ఎప్పుడూ మీ పాదాల దగ్గరే వుండి మీ సేవ చేస్తాను."

"చంపా!"

"బాబుజీ."

"నువ్వెంత మంచిదానివి!"

"నేను కాదు. మీరే మంచివారు."

ఆ రోజు నా జీవితంలో ఎంతో మహత్తర మయింది. అయిన వాళ్లందరిని పోగొట్టుకున్నాను. కాని నాకు తోడు నీడగా వుండే మనిషిని పొందగలిగాను. హృదయంలో దుఃఖం వుంది. ఉత్సాహం వుంది.

ఎంతో విచిత్రమైన ఆలోచనలతో కలత నిద్దరతో ఆ రాత్రి గడిచింది.

మర్నాడంతా ఆఫీసులో సాయంకాలం కోసం ఎదురు చూస్తూ గడిపాను.

చివరికి సాయంకాలం వచ్చింది. ఒక గంట ముందుగానే బయలుదేరి కనాట్‌ప్లేసులో "గిరిధర్ లాల్" కంపెనీకి వెళ్ళి నెక్‌లెసు కొన్నాను. తెల్లటి వంటిమీద ఎర్రరాళ్ల నెక్‌లెస్ ఎంత బాగుంటుంది!!

టాక్సీలో యింటికి చేరి బెల్ కొట్టాను.

చంపావచ్చి తలుపు తీసింది. నన్ను చూడగానే సంతోషంతో,

"మన యింటికి ఎవరు వచ్చారో చెప్పుకోండి" అని అంది.

"నాకు తెలియదు నువ్వే చెప్పు."

"లోపలికి వచ్చి చూడండి."

లోపలకు వెళ్ళాను. లక్ష్మణ్‌సింగ్ నిలబడి ఉన్నాడు.